# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబరు 21 నాటికి అన్నా క్యాంటీన్లు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు.**
2. **ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**
3. **ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేయనున్నామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ఎడ్ సెట్, పీజీసెట్ పరీక్షల ఫలితాలు విడులయ్యాయి.**
5. **భారతదేశానికి తొమ్మిదవ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన పాలనాదక్షులు పివి నరసింహారావు జయంతి ఈ రోజు.**

==========================

పత్రికా రంగంతో పాటు వివిధ రంగాల్లో రామోజీరావు అందించిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రామోజీరావు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన సంస్మరణ సభను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిన్న విజయవాడలోని కానూరులో నిర్వహించింది. ఈ సభకు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, చలన చిత్ర ప్రముఖులు హాజరై పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలుగుజాతికి, ప్రజలకు రామోజీరావు చేసిన సేవలను భావితరాలకు తెలియజెప్పేలా రాజధాని అమరావతిలో రామోజీ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతి అని నామకరణం చేయాలని రామోజీరావే సూచించారని ఆయన తెలిపారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన కర్తవ్యం అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సెప్టెంబరు 21 నాటికి ప్రతిపాదిత 203 అన్నా క్యాంటీన్లనూ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. విజయవాడలో నిన్న పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్‌తో కలిసి ఆ శాఖలోని వివిధ విభాగాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో నిర్మాణం

పూర్తయి స్వల్ప మరమ్మతులున్న నిర్మాణాలు, నిర్మాణాలు పూర్తి కావలసిన  అన్నా క్యాంటీన్ల భవనాల పూర్తి వివరాలు సిద్ధం చేయాలన్నారు. క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే సంస్థను టెండర్ల ద్వారా ఎంపిక చేయాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం నగదును ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వెలగపూడి సచివాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం అమలు తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల స్థాయి అధికారులతో  దృశ్య మాధ్యమం ద్వారా  సమావేశాన్ని  నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పథకాన్ని పెంచి ప్రజలకు ఇస్తుందని  చెప్పారు. జూలై ఒకటో తేదీన సచివాలయాల సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును పంపిణీ చేయాలని అధికారులను  ఆదేశించారు. ఏప్రిల్ నుంచి పెరిగిన పింఛన్ సొమ్ము, జూలై పెన్షన్ కలిపి మొత్తం 7 వేల రూపాయలు పింఛన్ దారులకు అందజేయాలన్నారు.

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు  తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. నిన్న ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ , ఎన్నికలు ముగిసినందున తెలంగాణ రాష్ట్రాభివృద్ధే  ధ్యేయమని చెప్పారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని, బడ్జెట్‌లో నిధుల కోసం  త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర హోంమంత్రిని కలుస్తామని తెలిపారు.  ఆంధ్రప్రదేశ్‌తో ఎటువంటి  సమస్యలు లేవని  ఏమైనా ఉంటే పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలోని వరంగల్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈరోజు పర్యటిస్తారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వరంగల్‌లోని చేనేత కేంద్రానికి చేరుకుని పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పనను పరిశీలస్తారని తెలిపారు. హనుమకొండలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో బీఈడీ  కోర్సుల్లో ప్రవేశాల కోసం  నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష – ఎడ్ సెట్ పరీక్ష ఫలితాలు  విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తరఫున ఆంధ్రా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 8న  ఎడ్ సెట్  నిర్వహించారు. ఈ ఏడాది ఎడ్ సెట్ పరీక్షకు మొత్తం 9,365 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జూన్ 15న ప్రాథమిక  కీ ని విడుదల చేశారు. జూన్ 18 వరకు అభ్యంతరాలను తెలుపవచ్చని అధికారులు తెలిపారు.  ఎడ్ సెట్ ఫలితాలు, ర్యాంక్ కార్డును అధికారిక వెబ్‌సైట్  ద్వారా పొందవచ్చని అధికారులు  సూచించారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీజీసెట్ ఫలితాలు కూడా విడుదలయ్యాయి. ఈనెల 10 నుంచి 13 వరకు ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల ఫలితాలను నిన్న సాయంత్రం అధికారులు విడుదల చేశారు. పీజీసెట్ ద్వారా 17 విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ పీజీ కళాశాలల్లో 145కి పైగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్ళు ఎన్నో రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాల బారిన పడే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ప్రజలందరూ సైబర్ నేరాల బారిన పడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాయి. ఈ క్రమంలో 'సైబర్ నేరాలు – నియంత్రణ' పై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యుల ద్వారా జరిగే శాసన మండలి సభ్యులు–ఎమ్మెల్సీల ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం నిన్న విడుదల చేసింది. అభ్యర్థులు జులై 2వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, జులై 3న నామినేషన్లు పరిశీలిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణకు జులై 5 తుది గడువుగా పేర్కొంది. జులై 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదేరోజు ఓట్ల లెక్కింపు చేపడతారు.

---------------------------

భారత దేశానికి తొమ్మిదవ ప్రధాన మంత్రిగా వ్యవహరించిన పాలనాదక్షులు, బహు భాషా వేత్త పివి నరసింహారావుగా సుపరిచితులైన పాములపర్తి వెంకట నరసింహారావు జయంతి ఈ రోజు. ఆయన... ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన తొలి దాక్షిణాత్యులు, అందులోను తెలుగు వారు కూడా కావడం విశేషం. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి.... కునారిల్లుతున్న వ్యవస్థను సక్రమ మార్గంలో పయనింపజేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. 1921 జూన్ 28వ తేదీన తెలంగాణా రాష్ట్రంలోని నరసం పేట వద్ద లక్నేపల్లి గ్రామంలో జన్మించిన పి.వి. 1957 సంవత్సరంలో రాజకీయ జీవితం ప్రారంభించారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగానే కాకుండా కేంద్ర రాజకీయాలలో ప్రవేశించి ప్రధాన మంత్రి పదవిని చేపట్టారు. 2004 డిసెంబర్ 23 వ తేదీన పి.వి. నరసిం హారావు తుదిశ్వాస విడిచారు.

---------------------------

తెలంగాణలో ఆషాఢం మాసం బోనాలకు భక్తుల రద్దీకి అనుగుణంగా రవాణా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయాల్లో ఆషాఢ మాసం బోనాల నేపథ్యంలో అమ్మవారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 8, 9, 10 తేదీల్లో జరిగే కార్యక్రమాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉచిత బస్సు ప్రయాణం ఉండటంతో గతంలో కంటే భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

ఐసీసీ పురుషుల టీ20 క్రికెట్ ప్రపంచకప్ పోటీలలో భాగంగా గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియంలో నిన్న జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్లో భారత జట్టు, ఇంగ్లండ్ జట్టు పై 68 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ నిర్ణీత 16.4 ఓవర్లలో 103 పరుగులు చేయగా భారత్ 68 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో భారత జట్టు మూడోసారి టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరింది. రేపు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టుతో భారత జట్టు పోటీపడనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో విజయవాడ క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని, తాగు నీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధులకు సంబంధించిన వివరాలను అందించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

======================